# పూర్వజన్మ సుకృతం

రెక్కవాలక పోయేసరికి రైలు కేకపెట్టింది. ఈ కేకతో రాము ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. కిటికీలోంచి బయటకు చూస్తే వచ్చేది తనవూరే. మూములు లెక్క ప్రకారం రైలు గమ్యస్థానం చేరటానికి ఇంకా 7ని॥లు వుంది. ఏడు నిముషాలు గడుస్తేగాని రైలు ముందుకు సాగదు. ముందుకు సాగితేగాని స్టేషన్‌కు చేరదు.

.....7 నిమిషాలు....? 7 సం॥లు కంటె గూడా ఎక్కువగా అనిపిస్తున్నవి. 7 నిమిషాలు గడిస్తే రైలు ఆ స్టేషన్‌కు చేరుతుంది. ఒకనాడు ఆస్టేషన్ వదలి వెళ్ళడానికి మనస్సు తహతహలాడింది. తిరిగి ఎన్నడూ యిక్కడికి రాకూడదని మనస్సు అనుకున్నది.

ఆ దుర్భర నరకానికి దూరంగా ఎవరకీ ఆనవాలు తెలియని చోటుకు పారిపోయి తల దాచుకోవాలని మనస్సు మరీ మరీ పోరింది.

నాకు ఎవ్వరూ లేరు నేను ఎవ్వరికీ ఏమీ కాను నేను వంటరివాణ్ణి అని మనస్సు ఆనాడు నిశ్చయించుకుంది. ఆనాడే ఆవాడను, సీమను మరలి పోవాలనే భావం.. మనస్సులో మరింత పెంచినది పెంపొందించినది యిద్దరే. ఈనాడు వారి వునికి, వారి తలపే తనని మరల యీ సీమకు తరలించింది. ఇద్దరు వ్యక్తులు భాను, జానకి. తను భాను, జానకి ముగ్గురు ఒకే నెలలో పుట్టేరు.

భాను ఎప్పుడూ ఏదో పగటి కలలు కనేవాడు, అమెరికావెళ్ళాలి. పెద్ద డిగ్రీలు సంపాదించాలి అని

"రాం ! నా అంతటి అదృష్టవంతుడు లేడురా, దేముడికి నేనంటే వల్లమాలిన దయ, మంచి యింట్లో పుట్టాను. అందమైన రూపే యిచ్చాడు. కోరిన చదువు యిచ్చాడు." అని అంటూండేవాడు.

"ఇహనేం ! సమయం చూసి కోరుకో, కోరిన పిల్లను కూడ యిస్తాడు." అని తను ఆనాడు అన్నాడు.

"ముందు అమెరికా వెళ్లిరానీ అప్పుడు పెళ్ళిమాట" అని ఏడు సంవత్సరాలనాడు అన్నాడు.

ఇప్పుడు ఏ దేశంలో వున్నాడో?

జానకి ఈ మరుభూమిలో తనకు దొరికిన శీతలచ్ఛాయ.

ఇంట్లో మారుతి తల్లిపోరు భరించలేకపోతే జానకి దగ్గరకు వెళ్ళేవాడు. మనస్సులోని బాధలన్నీ మాయమయ్యేవి. జానకి పెద్దదయింది. తనకు ఇరవై రెండు సంవత్సరాలు వచ్చాయి. జానకి పదిహేడుదాటి పద్దెనిమిదిలో పాదం పెట్టింది. జానకి పుట్టినరోజు పండుగనాడు తనూ, భానూ భోజనానికి వెళ్ళారు. రాత్రి ఎంతో బాగా విందు జరిగింది.

"గులాబీ మొక్కలు చూద్దువుగానిరా" అని జానకి పిలిచింది.

"ఇంత రాత్రప్పుడా?" అని తను అడిగాడు.

"పువ్వులను చూడాలంటే వెన్నెలలోనే చూడాలి" అని పలికింది.

గులాబీలు వెర్రిగ పూసినయి. ఎర్రటి పువ్వులను. జానకి ఎర్రటి పెదిమలు వెక్కిరించాయి పువ్వుల నుండి ఆ పిల్ల వంక చూసాడు.

ఈనాడు జానకిలో ఏదో క్రొత్త అందం కన్పిస్తోంది. గాలిలో దోబూచులాడే ముంగురులు, తెల్లటి పట్టుచీరె, ఎర్రటి అంచు, ఎర్రటి జాకెట్టు.

"అచ్చంగా పెళ్ళికూతురులాగ వున్నావు."

"మరి నువ్వో."

"నేనా ?"

"ఆ ! నువ్వే !" అని పక్కున నవ్వి "రాం" అని అన్నది.

"జానకీ"

"ఊఁ"

" ........................"

"ఏమిటి ?"

"నన్ను...."

నిన్ను ?

"పెళ్లి చేసుకో !"

జానకి ఏం మాట్లాడ లేదు.

సిమెంటు బల్లమీద కూర్చుని ముఖం చేతుల్లో కప్పుకుంది.

"కోపమా ?"

"లేదు."

"అయితే నా వంక చూడు."

"వెళ్లిపో."

ఏం మాట్లాడలేదు. ఆ పిల్ల పక్కన కూర్చుని ముఖం మీద నుండి రెండు చేతులూ తీసేసాడు.

జానకి ముఖమంతా కన్నీటితో తడిసింది.

"నీ మనసు బాధ పెట్టాను. క్షమించు వెళ్లిపోనా ?" జానకి ఏం మాట్లాడ లేదు. తన చేతిని అతని భుజం మీద వేసింది. ఆమెని దగ్గరగా లాక్కున్నాడు. ఒక్కసారి ఉలిక్కిపడిలేచి చెంగున ఇంట్లోకి వెళ్లిపోయింది. ఇంట్లోకి వస్తుంటే జానకీ వాళ్ల నాన్న కనిపించాడు.

"తోటలో ఏం చేస్తున్నారు ?"

"గులాబీ మొక్కలు చూస్తున్నాం."

"చీకట్లోనా ?"

"వెన్నెలుందిగా !"

"పురుగూ పుట్రా ఉంటాయి. ప్రొద్దుపోయింది."

మరునాడు ఉదయం తండ్రితో ప్రస్తావించాడు.

"జానకిని నేను పెళ్లిచేసుకొంటాను." తండ్రి "నీ యిష్టం అని" అన్నాడు.

"నా కంఠంలో ప్రాణం ఉండగా ఆ పిల్ల మన ఇంటికి రావటానికి వీలులేదు" అని మారుటితల్లి అంది.

"ఎందుకని అని అడగవద్దు. మన అంతస్థుకు తగినవాళ్లు కాదు."

"వాళ్ళేం కులగోత్రాలు లేనివాళ్లుకాదే. మనంత మర్యాదస్తులే."

"నేను బ్రతికి ఉండటం ఇష్టం లేకపోతే ఆ పని చెయ్యి. నేను పోయిన తరువాత మీనాన్నొక పిల్లని, నువ్వొక పిల్లని పెళ్ళి చేసుకొని హాయిగ ఉండవచ్చు."

నాన్న తనగదిలోకి వెళ్లిపోయాడు. తను వీధిలోకి వచ్చాడు. నాన్న పిన్నిని ఏమీ అనలేడు. ఆస్తి అంతా ఆవిడది. అప్పులన్నీ యీయనది. సరాసరి జానకి వాళ్ల యింటికి వెళ్ళాడు. జానకి వాళ్ల నాన్నతో జరిగిన సంగతులన్నీ చెప్పేసాడు.

"నువ్వు ఇంకా అస్వంతంత్రుడివి. తల్లి తండ్రుల చాటు మనిషివి, నాకు మాత్రం ఏపది మంది ఉన్నారు. ఉన్న ఒక్క పిల్లను తల్లి తండ్రులకు ఇష్టంలేని చోట యిస్తే అది పడే ఆగచాట్లు నేను చూడలేను. మీ పిన్ని సంగతి నాకు బాగా తెలుసు. కోపం వద్దునాయనా ! ఆవిడది పాము పగ."

"జానకిని నాకివ్వనంటారా ?"

"దానికి ఇప్పట్లో పెళ్లిచేయాలని నాకు లేదు. బాగా చదివించాలని ఉంది."

"జానకి ఉద్దేశం కూడ అదేనా ?"

"బాగా చదువుకోవాలని అదే కోరింది. అందుకనే ఈ ఊళ్ళో అందరినీ ఎదిరించి దానికి చదువు చెప్పిస్తున్నాను."

"మరి నేను...."

"నువ్వు ఇంకా చాల చిన్నవాడివి. చదువులో బాగా అభివృద్ధిలోకి రావటానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు నీ అంతటి వాడివై మీ అమ్మా, నాన్నచేత అవుననిపించు కో గలిగితే, జానకిని నీకు ఇవ్వటానికి నాకేం అభ్యంతరం ఉండదు."

"జానకితో ఒక్కసారి మాట్లాడనా ?"

"ఈ సమస్య వచ్చిన తరువాత మాట్లాడకపోవడమే మంచిది."

"అంతేనంటారా ?"

"అంతే"

అక్కడ నుంచి యింటికి బయలుదేరాడు ఒక్కరోజులోనే ఎంత మార్పు ?

ఇంటికి చేరగానే పిన్ని హేళనగా,

" ఏమన్నాడురా మీ మామగారు ?" అని అడిగింది.

ఫెళ్లున చెంపపెట్టులా తగిలింది యీ మాట

సరాసరి తనగదిలోకి వెళ్లికూర్చున్నాడు.

ఇన్ని సంవత్సరాల తర్వాత యీనాడు తన కన్నతల్లి గుర్తుకు వచ్చింది.

"అమ్మా" అని పిలిచాడు.

"ఏం నాయనా ?" అని ఎవరో బదులు పలికారు. వెనక్కి తిరిగి చూస్తే తనను తల్లికంటె ఎక్కువగా యింతకాలం పెంచిన వంటావిడ విశాలాక్షమ్మగారు.

"ఏం లేదు."

"అంతా విన్నాను, మొగవాడు తన కాళ్లమీద నిలబడ గలిగితేనే గౌరవం !"

"అంతేనా ?"

"అంతే !"

భాను దగ్గరకు వెళ్లి జరిగినదంతా చెప్పాడు. వాడు నవ్వి

"అప్పుడే పెళ్ళేమిటిరా ? చూడవలసినవి' చెయ్యవలసినవి ఎన్నో ఉండగా ఇప్పటినుంచే ఈ గుదిబండ దేనికి ? నెలకు వెయ్యిరూపాయిలైనా లేందే ఈ రోజుల్లో పెళ్లానెట్లా పోషించడం ?"

"ఇప్పుడు పోషిస్తున్నవాళ్లు ?"

"అది పోషణ కాదురా. ఆత్మ శరీరం వదిలిపోకుండా మధ్య, మధ్య నాలుగు

నీటి చుక్కలు పోయడం అంతే.

"అంతేనా ?"

"అంతే"

"నలుగురిచేతా ఔననిపించుకో, అప్పుడేవాళ్ళు నీ కాళ్ల దగ్గరకువచ్చి రంభలాంటి పిల్లను పడేస్తారు. నీ అంతటనువ్వు కోరేవా చులకన అవుతావు."

"అయితే నన్ను"

"ముందు ప్రయోజకుడివికా. ఆనాడు, ఇప్పుడు యిన్నిధర్మపన్నాలు వల్లించిన జానకి వాళ్ల నాన్న వాళ్ల పిల్లను చేసుకో మని తనే మీ ఇంటి చుట్టుతా తిరుగుతాడు.

"అంతేనా ?"

"అంతే"

సరాసరి ఆంజనేయస్వామి గుడికి వెళ్ళి కూర్చున్నాడు. ప్రొద్దు వాటారుతుంటే జానకి వచ్చింది. దేముడికి కొబ్బరికాయ కొట్టి. మండపం దగ్గరకు వచ్చి ఒక్క క్షణం కూర్చుంది.

" జానకి" అని రాము పిలచాడు. ఉలిక్కిపడి

"నువ్వా" అని అంది.

"నేనే"

"నాన్న నీతో చెప్పాడా ?"

"చెప్పాడు"

"మరి నువ్వేమంటావు ?

"నువ్వు చాల పెద్దవాడివి కావాలని గొప్ప ఆఫీసరువి కావాలని ప్రార్థించి కొబ్బరికాయ కొట్టాను."

"నువ్వు నా నీడను ఉంటే యివన్నీ తప్పక సాధిస్తాను."

"నువ్వు ఇవన్నీ సాధిస్తే కానీ నేను నీ నీడకు రాలేనుగా".

"అంతేనా ?"

"అంతే."

ఆ రోజు రాత్రి ఒంటిగంట బండి బయలుదేరేముందు ఆఖరిసారిగా కూతపెడుతూ ఉంటే ఎవరో త్వరగా పరుగెట్టుకుంటూ వచ్చి రైలు ఎక్కారు.

ఆనాటికీ ఈనాటికీ ఏడు సంవత్సరాలు గడిచిపోయాయి.

ఈనాడు తాను అందరికన్న మిన్న అనిపించుకొని, నలుగురిచేతా

ఔననిపించుకొని యింటికి వస్తున్నాడు.

తనకు స్వాగతం యివ్వటానికి తన వారంతా తన కోసం వేచియుంటారు. ముందుగా ఎవ్వరిని పలుకరించాలి. ఎవ్వరి పలుకులను అందుకోవాలి. ఈనాడు ఎవరూ తనని కాదనరు. తన కోసం......

రైలు ఒక్కసారిగా కూతబెట్టి బయలుదేరింది. ప్లాట్‌ఫారం చేరేసరికి దాదాపు అంతా నిర్మానుష్యం. చెదురుమదురుగా ఒకరిద్దరు మనుష్యులు కనిపిస్తున్నారు.

స్టేషనంతా కలయచూసినా తనవారెవరూ లేరు. ఎవరూ తనకోసం రాలేదు. అందరి ఉనికి తనకు కావాలి. తను ఎవ్వరికీ అక్కర్లేదు. ఆనాడే కాదు ఈనాడూ అంతే.

"తిరిగి వెళ్లిపోదాం...."

'బాబూ కూలి' అని ఒక కంఠం పలికింది.

'సామాన్లు వెయింటింగ్ రూంలో పెట్టు ! మళ్ళీ బండి ఎప్పుడుంది ? ....

సామాన్లు అన్నీ దింపి ఫ్లాట్‌ఫారం మీద పెట్టి పెట్టిలో ఏమైనా మర్చిపోయాడేమో చూడటానికి కూలి మళ్ళీ కంపార్టుమెంటు ఎక్కాడు.

ఇంతలో ఎవరో ముసలాయన తొందరగా ఇటే వస్తున్నాడు. రామాన్ని చూడగానే, 'నాయనా' అని అన్నాడు. రాము సమాధానం చెప్పేలోపలే రామాన్ని కౌగలించుకొని.

'కోపం తీరిందా' అని అడిగాడు.

"సామానులు కారులో పెట్టు" అని ఒక గొంతుక అన్నది. అటు చూస్తే తన మారుటి తమ్ముడు తన దగ్గరకు వచ్చాడు.

"ఎల్లా ఉన్నావురా ?" అని రాము అడిగాడు.

"బాగానే ఉన్నాం" అని సమాధానం వచ్చింది. ముగ్గురు కారులో కూర్చున్నారు కారు బయలుదేరబోతుంటే రాము.

'కారు చాల బావుంది కొన్నావా ?'

'కొనడం దేనికి ? మా డిపార్టుమెంటు వాళ్లు ఇస్తారు'

'ఇక్కడే ఉద్యోగం చేస్తున్నావా ?'

'అంతా పారిపోతే ఎల్లా ?'

ఇంటికి చేరేసరికి సవితి తల్లి ఇతన్ని చూడగానే.

'ఇప్పటికైనా యిల్లు కనిపించిందా ?' అని అడిగింది.

రాము ఏం మాట్లాడలేదు. ఒక్కక్షణం తేరిపార చూసి,

'ఈ సారైనా యింటిపట్టున ఉండటం ఉందా ? మళ్ళీ లేచిపోతావా ?'

"నువ్వు నోరు మూసుకో" అని నాన్న అన్నాడు.

'ఇంతకాలం నోరు మూసుకొనే ఉన్నాను.'

'ఇహ ముందు కూడ అల్లాగే ఉండు.'

'సామానులు ఎక్కడ పెట్టను ?' అని తమ్ముడు అడిగాడు.

'మళ్ళీ కారులో పెట్టేసేయి' అని రాము అన్నాడు.

'అదేమిటి నాయనా ?' అని తండ్రి అన్నాడు. తమ్ముడేం మాట్లాడలేదు.

'సామానులు నీ గదిలో పెట్టాను. స్నానం చెయ్యి ! భోంచేద్దాం. నేను త్వరగా ఆఫీసుకు వెళ్లాలి.

'ఈ పూట సెలవు పెట్టు'

'ప్రతీ చిన్న విషయానికి సెలవు పెడితే ఉద్యోగంలోంచి ఊడబీకుతారు.'

'పోతే పోయింది వెధవ ఉద్యోగం.'

'ఇచ్చారులెండి మా మంచి సలహా ! ఒకడిని బాగుచేసారు. రెండోవాడిని కూడ పుణ్యాం కట్టుకోండి.'

రాము ఏం మాట్లాడలేదు. బూట్లు విప్పి వంట ఇంట్లోకి వెళ్లాడు. అక్కడ విశాలాక్షమ్మగారి దగ్గర కూర్చుని ఎవరో యిరవై ఏళ్ళ అమ్మాయి పూరీలు వత్తుతూంది. వాళ్లిద్దరూ యితన్ని చూడలేదు. రాము ఆవిడని చూసి

'నేను వచ్చానమ్మా' అని అన్నాడు.

'వచ్చావా నాయనా' అని ఆవిడ యితని దగ్గరకు వచ్చింది.

'ఎల్లా ఉన్నావమ్మా'

'నాకేంరా తండ్రీ ! నువ్వే బాగా నలిగిపోయావు.'

'.................'

'లే మడికట్టుకో, ఎప్పుడనగాతిన్నావో !'

రాము కంటి వెంట నీరు తిరిగింది.

'ఆకలి లేదు.'

"ఉండదని నాకు తెలుసు, నీకు అంతా అన్యాయం చేసారు."

"కాని నువ్వు మాత్రం చెయ్యవుగా."

'అబ్బాయి' అంటూ నాన్న కంఠం వినిపించింది.

సావిట్లోకి రాగానే స్నానం చేసి, బట్టలు మార్చుకో, భోంచేద్దాం.' అని అన్నాడు.

'మీరు భోంచేయండి. నాకు ఆకలిగా లేదు.'

'నామీద కూడా కోపమా ?'

"లేదు."

భోజనం దగ్గర కూర్చుంటే యిందాక కనపడ్డ పిల్ల వడ్డించటం మొదలు పెట్టింది.

"మన చిన్నబ్బాయి పెళ్ళాం." అని నాన్న అన్నాడు.

తను లేకుండా తమ్ముడి పెళ్లి అయింది. కనీసం తనకు శుభలేఖ అయినా రాలేదు.

"ఏ వయస్సులో జరగాల్సినపని ఆ వయస్సులో జరగాలి. అందుకని వాడు చేసుకుంటాననగానే చేసేసాం." అని సవితి తల్లి అంది.

"సంతోషం ! మన అంతస్థుకు హోదాకు బాగాతగినవాళ్ళే అనుకుంటాను."

'అంతస్థులు, హోదాలో ఏముంది ? మనసులు మంచివి అయితే చాలు.

"నిజం చెప్పావమ్మా ! తమ్ముడు ఎల్లాగైనా అదృష్టవంతుడు."

"నీకు మాత్రం ఏం తక్కువ ?"

"నీ కడుపున పుట్టక పోవడమే."

"నిజమే."

భోజనం చేసి సావిట్లోకి వస్తుంటే తమ్ముడు బయటకు వెళ్లేప్రయత్నంలో ఉన్నాడు.

"కారు యీ పూట నాకు వదిలిపెట్టు." అని రాం అన్నాడు.

"డ్రైవింగ్ లైసెన్సు ఉందా ?"

" ఉంది"

"అయితే తీసుకువెళ్లు."

కారు జానకీ వాళ్ల యింటిముందర ఆగింది. జానకి వాళ్ల నాన్న పేరు పెట్టి పిలిచాడు. తలుపు తీసుకొని ఎవరో వచ్చారు. ఆ వచ్చిన వ్యక్తి జానకి లాగ ఉంది. కాని జానకి కంటే చాల తరాలు పెద్దదిగా కన్పిస్తోంది. ఇద్దరూ కొద్ది క్షణాలు ఏం మాట్లాడలేదు. చివరకు జానకి,

"ఎప్పుడు వచ్చావు ?'

"ఈరోజే"

సావిట్లోకి వెళ్లి కూర్చున్న తరువాత

"నాన్నగారేరి. ?"

"లేరు"

"తిరిగి ఎప్పుడు వస్తారు ?"

" తిరిగి రారు."

" ఓ... ఎప్పుడు జరిగింది ?"

"నాలుగు సంవత్సరాలు. ఎందుకొచ్చావిక్కడికి ?"

"నీకోసమే,"

"నా కోసమా ?"

"అవును జానకీ, ఈనాడు నేను నువ్వు పెట్టిన షరతులన్నీ పూర్తిచేసుకు వచ్చాను. ఈనాడు నాకు పెద్దపదవి ఉంది. ఇప్పటికైనా నానీడను నిలవటానికి నీకు సంకోచం ఉండదనుకుంటాను."

"పిల్ల లెందరు ?"

"ఎవరికి ?"

"నీకే"

"నాకా ?"

"అవును, అయిదు సంవత్సరాలనాడు నువ్వు కట్టుకొన్న పిల్ల ఎవరది ?"

ఏ పిల్ల ?

"నా కంటే నీకే బాగా తెలుసు."

"ఏమిటా మాటలు జానకీ ? ఎవరు చెప్పారు ?

"మీకు కావలసినవాళ్లే"

"ఏమని !"

"నువ్వు ఏవరితోనూ చెప్పకుండా ఎవరినో వివాహం చేసుకున్నావని"

"నువ్వు కూడ నమ్మావా ?"

"మనుష్యులు దూరమైతే మనసులు మారిపోతాయని అనుకొన్నాను." నేను నీకుఅన్యాయం చేస్తానని అనుకున్నావా ?

"నువ్వూ మనిషివే. మనుష్యులు చేసే పని నువ్వు చేసావనుకొన్నాను."

"లేదు జానకీ, ఈ ఏడు సంవత్సరాలు పగలనక, రాత్రనక నీ కోసమే కష్టించాను. మిమ్మల్ని మెప్పించగలిగితే నువ్వునాదానివవుతావనే ఆశతోనే నేను

నిలిచాను."

జానకి ఏం మాట్లాడలేదు. ఎత్తిన తల వంచింది. తన పాదాల వంక చూసుకుంది. రాము దృష్టికూడ అక్కడే నిలచింది.

"జానకీ" అని ఒక్కసారి అన్నాడు పిలుపు హృదయాన్ని చీల్చుకుని వచ్చింది.

"నాతో ఎందుకు చెప్పలేదు ? నాకు ఎందుకు తెలియపరచలేదు ?"

"నువ్వునాతో చెప్పేవెళ్ళావా ?"

"అందుకనా యీ శిక్ష ?"

"ఎవరికి ? "

"నాకే ! ... వారు ఎక్కడ ?"

"ఇక్కడే"

"ఉద్యోగం చేస్తున్నారా ?"

"లేదు. ఇంటి దగ్గరే ఉంటున్నారు"

"ఇప్పుడు యింట్లో ఉన్నారా ?"

"చూస్తావా ? లోపలికిరా. "

ఇద్దరూ లోపలి గదిలోకి వెళ్లారు. అక్కడ మంచాన్ని అంటిపెట్టుకొని ఒక వ్యక్తి పడుకొని ఉన్నాడు.

"నరసింహంగారి అబ్బాయి రాం వచ్చాడు." అని జానకి అంది. అతనేం మాట్లాడలేదు. ఒక్కసారి రామంవంక చూసాడు.

"చిన్నప్పుడు మా నాన్నగారి దగ్గర చదువుకొనేవాడు."

"........................."

" ఈరోజే వాళ్ళ ఊరు వెళ్ళిపోతున్నాడట. చూసిపోదామని వచ్చాడు."

"........................."

"నాన్నగారంటే చాల గౌరవం. వారు పోయినట్టు యింతవరకు తెలియదట, పాపం వినగానే చాల విచారించాడు."

"వెళ్ళొస్తానండి" అని రామం నమస్కారం చేసి బయటకు వచ్చాడు జానకి కూడ వెంట వచ్చింది.

"ఏమిటి సుస్తీ ?"

"పక్షవాతం."

"మాట"

"పడిపోయింది ఒక పక్షమంతా పని చెయ్యదు." రామం ఏం మాట్లాడలేదు. దృష్టి గోడకు వేలాడుతున్న ఆంజనేయ స్వామి పటం మీదకు మళ్లింది. అక్కడే ఒక్క క్షణం నిలచింది.

"నువ్వు ఎవ్వరికీ కలలో కూడ అపకారం చెయ్యవే, ఎందుకు నీకీ శాపం."

"పెద్దవాళ్లమాట విన్నందుకు."

........ జానకీ !

వెళ్ళిపో రామం !

"వెళ్ళిపోమంటున్నావా ? ఇన్ని సంవత్సరాల తరువాత వస్తే...."

"అందుకనే వెళ్ళిపోమంటున్నాను"

"ఎందుకని ?"

"ఇక్కడ దుఃఖం తప్ప నీకేం లభించదు"

"......................."

"వారికి పండురసం యివ్వాలి"

"రామం కారులో కూర్చున్నాడు. జానకి ఒక తలుపు దగ్గరగా వేసి నిలబడ్డది. కారు బయలుదేరింది. రామ చెయ్యిఊపాడు. జానకి అల్లాగే నిలబడి ఉంది.

కారు వల్లమాలిన వేగంతో రెండు మైళ్లు ప్రయాణం చేసి భానువాళ్ళ యింటి దగ్గర ఆగింది. తలుపు తట్టితే భానువాళ్ల సవతితల్లి తలుపుతీసి యితని వంక గుర్తు పటనట్లు చూసింది.

"నేనండి రామాన్ని, భాను ఉన్నాడా ?"

"వాడు ఇక్కడ ఎందుకు ఉంటాడు ?"

"ఏ ఊళ్లో ఉన్నాడు ?"

"పొలంలో ఉన్నాడు."

"ఇంటికి ఎప్పుడు వస్తాడు."

"రాడు. అక్కడే ఉంటున్నాడు." భాను వాళ్ళ పొలం దగ్గరకు వెళ్లాడు. అక్కడ భాను కనిపించనేలేదు. ఎవరో కూలివాళ్లు పని చేసుకుంటున్నారు. ఇతన్ని చూసి ఒక వ్యక్తి యితని దగ్గరకు వచ్చి నిలబడ్డాడు.

"ఒరేయి భానుని పిలవరా ?" అని అన్నాడు. ఆ మనిషి కదల్లేదు. అక్కడే నిలబడ్డాడు. ఇతని వంకనే ఒక్కక్షణం చూసి "రాం" అని అన్నాడు. ఈ పిలుపుకు

రాం ఉలిక్కిపడ్డాడు. ఎదురుగా నిలబడి ఉన్నది ఎవరు ? ఎవరు ? ఈ నల్లటి రూపేమిటి ? ఈ చిరిగిపోయిన బనియను, ఎవరీమనిషి ?

"భానూ ఏమిటిరా ఇదంతా ?"

"ఎప్పుడు వచ్చావు ?"

"ఇవ్వాళే వచ్చాను, ఏమిటిదంతా ?"

"మా నాన్నని అడుగు చెప్తాడు."

"ఏమిటిరా మీ నాన్నని అడిగేది ? వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను. ఎవ్వరిని పలుకరించినా అస్తవ్యస్తంగా మాట్లాడే వాళ్ళే, ఎందుకురా నా వాళ్ళంతా యిలా నాశనమైపోతున్నారు."

"నీలాగ పారిపోయే ధైర్యంలేక"

"నీకు యిక్కడ సుఖంగా లేకపోతే నా దగ్గరకు వచ్చి ఉండరా."

"శిక్ష పూర్తికాందే.

ఏం శిఖ ? ఎప్పటిదాక ?"

"బ్రతికున్నంత కాలం..... కఠిన శిక్ష"

"భానూ ! ఏం జరిగిందో చెప్పరా, నేను అన్నీ సరిదిద్దుతాను"

"చచ్చిపోయిన వాళ్లని బ్రతికించగలవా ?"

"నేనా ! ఎవరు పోయింది ?"

"ఆ వివరాలన్నీ మా నాన్నని అడుగు చెప్తాడు."

"భానూ"

"వెళ్లిపో రాం ! నువ్వైనా ఏదో చోట సుఖంగా బ్రతుకు."

"నాకు యింకా సుఖమేమిటి ? నాకు కావలసిన ఇద్దరూ యిలా ఎండిపోతే... వాళ్ళతో పాటు నా జీవితం కూడ ఎండిపోతే, ఏం లాభం"

"వెళ్ళిపో రాం ! ఈ ఊరికేదో శాపంపట్టుకుంది. మనుష్యులు మనుష్యులుగా బ్రతకడం మర్చిపోయారు. నువైనా ఎక్కడో ఒకచోట సుఖంగ ఉంటావనే తలంపు మా ఇద్దరికీ బ్రతుకు మీద ఆశ నిలిపింది."

"భానూ నా దగ్గరకు రా నీకు అన్ని విధాల సుఖంగ ఉండే ఏర్పాటు చేస్తాను."

"సుఖపడే హక్కునాకు లేదు. కమలని వదిలిరాలేను."

"ఆవిడను వెంటతీసుకురా."

"వెంటరాదు."

"ఎందుకని ?"

"రాదు"

"నాకు ఆవిడను చూపించు, నేను నచ్చచెపుతాను."

"రా ! చూపిస్తాను." ఇద్దరూ కలసి దగ్గరలో ఉన్న ఒక చిన్న ఆశ్రమం లాంటి చోటుకు వెళ్లారు. అక్కడ ఒక తులసికోట కట్టిఉంది. దాని మీద మూడక్షరాలు చెక్కి ఉన్నాయి. "కమల."

రాం ఒక్క క్షణం ఏం మాట్లాడలేదు. ఆ సమాధికి నమస్కారం చేశాడు. ఇంత వరకు ఆగిన శోకం ఇప్పుడు కట్టలు తెగింది. చిన్న పిల్లవాడిలా వెక్కి వెక్కి ఏడ్చాడు.

భాను ఏం మాట్లాడలేదు. శూన్యంలోకి చూస్తున్నాడు.

"భగగవంతుడులేడు." అని రామం అన్నాడు.

"ఈ ఊళ్లో లేడు, అంతే."

ఏం మాట్లాడకుండా తిరిగి కారు దగ్గరకు వచ్చారు. కారు బయలుదేరి ఊళ్లోకి వచ్చింది. రచ్చబండ దగ్గర అగింది. అక్కడ భానువాళ్ళ నాన్న కూర్చొని ఉన్నాడు.

"నేనండి రామాన్ని" అని రామం అన్నాడు.

అబ్బాయి దగ్గరకు వెళ్ళావా ?

"వెళ్ళాను"

"ఏమైనా చెప్పాడా ?"

"మిమ్మల్ని అడగమన్నాడు."

"నాకు తెలుసు,"

" భాను ఎందుకలా అయ్యాడు ?"

"అదృష్టం చాలక."

"ఎవరికి ?వాడికా ? మీకా ?"

"ఐశ్వర్యం లేకపోతేనేం ? ఆ పిల్లలో కొట్టొచ్చే అందం ఉంది. చదువుంది. మనవాడిని చూసి మెచ్చుకొంది. అంత వరకు పెళ్లివద్దన్నవాడు కూడా సరేనని యిటే మ్రొగ్గాడు."

"నేను సరేనన్నాను మొదట్లో ?"

"తరువాత ఏమైంది ?"

"ఇల్లాలిపోరు ఎక్కువైంది. నాకు ఉన్నకళ్లు పోయాయి. అంతస్థని, హోదా అని ఏమిటేమిటో అర్థంలేనివాటి కోసం ప్రాకులాడాను. ఏమైంది ?"

"ఈ ఊళ్లోవాళ్లేం తక్కువ తిన్నారా ? ఆ పిల్ల తల్లి తండ్రులకు మా హోదా, అంతస్థు పనికిరాలేదు. ఆ పసిదాన్ని రాసి రంపాన పెట్టారు. ఆ రోజు భాను ఊళ్ళో లేడు. ఉద్యోగం యింటర్వ్యూకు వెళ్లాడు.

" సెలక్టయి ఇంటికి వచ్చాడు. రైలు స్టేషనులోనే ఈ వార్త తెలిసింది. "

"ఏమిటిది ?"

"నేను కట్టించిన కొలనులోకి దూకి ఆ పిల్ల బ్రతుకు బండలు చేసుకుంది. నా తండ్రి అక్కడనుంచే శ్మశానానికి పరుగెత్తుకెళ్లాడు. కనిపెంచిన తండ్రి ఆ పిల్లను దహనం చేయబోతున్నాడు. భాను నేను చేస్తానండి." అని అన్నాడు. ఇంత వరకు ఊరుకొన్న అన్నలు నరసింహావతారంతో వాడిమీద విరుచుకుపడ్డారు. ఆ తండ్రి అడ్డుపడకపోతే పిల్లవాడు మనకి ప్రాణాలతో దక్కేవాడు కాదు. ఆ మహానుభావుడు మనిషికాదు. దేవత. అంత దుఃఖంలోను వాడిని ఓదార్చాడు, నేను పిరికి వెధవలాగ యింట్లోంచి కదలకుండా దాక్కున్నాను. చీకటి పడుతూ ఉండగా యింటికి వచ్చాడు.

'చేసిన నేరానికి శిక్ష ఎవరనుభవిస్తారు' అని అడిగాడు.

నేనేం మాట్లాడలేదు.

"నేను హంతకుడిని, ద్రోహిని" అని వెళ్ళిపోయాడు ఏనాడు ఏ అఘాయిత్యం చేస్తాడోనని భయమే, అదే నాకు గొప్ప శిక్ష"

"పాపం!"

"ఆనాటి నుంచి నా తండ్రి నా పై కత్తి కట్టాడు వాడి పగను ఈ విధంగ తీర్చుకొంటున్నాడు."

"దీనికేం ఉపాయం లేదా ?"

"పోయిన పిల్ల బ్రతికి రావడమే !"

"అంతేనా "

"అంతే !"

అక్కడ నుంచి సరాసరి ఇంటికి వచ్చి సామానులన్నీ పరటం మొదలు పెట్టాడు. తమ్ముడు గదిలోకి వచ్చాడు.

"సామానులు సర్దుతున్నావు ఎందుకు ?"

ఉలిక్కిపడి పెళ్లికూతురు యిటు చూసింది. రామం యీ వంక చూడకుండా యింకొక ఫోటో తీసే ప్రయత్నంలో వున్నాడు.

"రామం!!"

"నన్ను సర్వహక్కులతో యిచ్చేస్తున్నారు రామం !" అంటూ ఆ పిల్ల ముఖాన్ని రెండు చేతులతో కప్పుకుంది. చేతులో వున్న అక్షింతలు కన్నీటిలో కలసి జలజలారాలాయి. ఆలోచనలలో వున్న ముత్తైదుకు వులిక్కిపడి వీళ్ళిద్దరివంకా చూసి...

"ఏమిటే అమ్మాయి ?" అని అడిగింది.

"ఏం లేదు మామ్మా, కంట్లో నలక పడ్డది" అని పెళ్లికూతురు సమాధానం యిచ్చింది.

అక్కడ నుంచి రామం పెళ్లిపందిట్లోకి వచ్చాడు. మొగపెళ్లివారి భజంత్రీల శబ్దం వినిపించింది. ముందు బ్యాండు మేళం వెనక టాపులేని కారులో పెళ్లికొడుకు కారు దిగి అతను లోపలికి వస్తుంటే ఆడపెళ్ళివారి తాలూకూ ఆడవాళ్లు

"అచ్చంగా దొరలాగా వున్నాడే. కలక్టరంటే అలా వుండాలి" అని అనుకున్నారు.

పెళ్ళి కొడుక్కి ఫోటో తియ్యడం కోసం రామం రిఫ్లెక్సు కెమెరా వ్యూ ఫైండరులో చూస్తూ ఒక్కొక్క అడుగే వెనక్కి వెయ్యడం మొదలు పెట్టాడు. కాలికేదో తగిలింది. చూస్తే అది పెళ్ళికొడుకు కోసం వేసిన ఎత్తుపీట. రామం అక్కడే ఆగి, పెళ్లికొడుక్కు, అతని బృందానికి ఫోటో తీశాడు. పెళ్ళికొడుకు యితని వంక చూసి, 'థాంక్యూ!' అని అన్నాడు.

పురోహితుడు చకచకా మంత్రాలు చదువుతూ, మధ్యలో "పెళ్లికుమార్తెను తీసుకురండి... అని అనగానే ప్రక్కన యిద్దరు ముత్తైదువులు, మేనమామ వెంట రాగా, వడిలో కొబ్బరిబొండాం పెట్టుకుని పెళ్లికుమార్తె యిటు నడిచి వస్తోంది. ఆ మనిషిని చూసి మొగపెళ్లి వారంతా

"మనవాడు చాలా అదృష్టవంతుడు" అని అనుకున్నారు.

పెళ్లికుమార్తె, తల్లి ప్రక్కన కూర్చోబోతూంటే, ఫ్లాష్ బల్బు వెలిగింది. పెళ్లి కూతురు ఒక లిప్తకాలం యితని వంక చూసి, తల వంచుకుంది. పెదిమలు కదల్లేదు కాని, కళ్లుమాత్రం.

"నన్నింకా చిత్రవధ చేస్తావు దేనికి ?" అని అంటున్నాయి. హృదయాన్ని వెయ్యి ప్రక్కలు చేస్తూ రామం గుండెల్లోంచి ఒక నిట్టూర్పు వెలువడింది.

"ఫోటోగ్రాఫరుని కావడం నాకొక శాపం ! వెళ్లిపోవాలి ! ఇక్కడ నుంచి చాలా దూరం వెళ్లిపోవాలి" అని అనుకుని గిరుక్కున వెనక్కి తిరిగి వడిగా రెండుడుగులు

వేశాడు, అంతక్కు మించి అడుగు సాగలేదు మొదట పలుకరించిన కుర్రవాడు రెండు కప్పుల కాఫీ పుచ్చుకుని దారికి అడ్డంగా నిలబడి వున్నాడు.

"వేడి వేడి కాఫీ త్రాగు ! మనస్సు చల్లబడుతుంది."

"కృష్ణా !"

"ఒరేయి ! కాఫీ గత ప్రాణీ ! నీ ఎత్తులన్నీ నాకు తెలియవనుకున్నావా. రెండు ఫొటోలు తీసావో లేదో అప్పుడే పెద్ద అలిసిపోయిన వాడిలాగా ఫోజు పెట్టావు. అల్లా ఫోజులు పెట్టకపోతే కాఫీ కావాలని అడగకూడదూ ? నీ కోసం రెండు పెద్ద ప్లాస్కుల నిండా పోయించాను.

"థాంక్యూ" అంటూ రామం కాఫీ త్రాగి, ఒక్కసారి కొబ్బరిచెట్టు వెనుక వున్న ఆకాశం చూశాడు. మబ్బులో దాగిన చందమామ, మబ్బు విడిచి రామాన్ని చూసి, పక్కున నవ్వాడు.

మనస్సుకు అర్థంకాని బాధ కలిగింది. నిట్టూర్పుగా ఆక్రోశించింది.

"ఎందుకురా అలా దిగులు పడతావు ! ఈ బ్రహ్మచర్యం యింకా ఎంతకాలం అని బాధపడుతున్నావా. ఆ ముచ్చటా తీరుస్తాంలే ! మంచి వాడివిగా, ఫోటో తియ్యి నాన్నా !"

రామం యిహ అక్కడ ఒక్కక్షణం కూడా నిలవలేదు. మళ్ళి పెళ్ళి మండపం దగ్గరకు వచ్చి ఫొటోలు తియ్యటం మొదలు పెట్టాడు లగ్నం పూర్తియై పెళ్ళికుమార్తె పెళ్ళికొడుకూ పీటల మీద నుంచి లేచే దాకా, ఫోటోలు తీశాడు. పెళ్ళికుమారుడు ఒక్కడూ ఒంటరిగా ఒక కుర్చీలో కూర్చొని చుట్టుతా కలయజూచి రామాన్ని చూడగానే రమ్మని పిలిచాడు. దగ్గరకు రాగానే,

"రామం అంటే మీరే కదూ" అని అడిగాడు."

"నేనే !"

"పత్రికల్లో పడే మీ ఫోటోలు చూస్తూ వుంటాను. చాలా బాగుంటాయి."

"థాంక్యూ"

"సముద్రం ఒడ్డున శ్యామలా పావురాయిల వున్న ఫోటో."

"నేను తీసిందే"

"నేను అస్సాం అడవుల్లో వుండగా యీ ఫోటో నాకు పంపించారు. అప్పుడే అనుకున్నా."

"ఏమని అనుకున్నారు ?"

ఇంత చక్కటి ఫోటో తీసిన వ్యక్తిని తప్పక కలుసుకోవాలనిపించింది. ఆ

బొమ్మలోని కాంపోజిషన్ నాకు పరిచయం వున్నది లాగా కనిపించింది. ఆ ఫోటో వంక ఎంత సేపు చూస్తూ కూర్చున్నానో తెలియదు. ఆ కెరటాలు నిజంగా కదులుతున్నట్లు, ఏ క్షణంలో నైనా ఆ ఫోటోలోని వ్యక్తి నన్ను పలుకరిస్తుందేమో ననిపించింది. ఆ వ్యక్తి ఎదుట నేను కూడా కూర్చోని సముద్రం వంక చూస్తున్నట్టు అనిపించింది.

"అ యాం గ్లాడ్..."

"ఒక్క చిన్న రహస్యం చెప్పనా ?"

"నాతోనా ?"

మీతోనే చెప్పాలి... ఈ పెళ్ళి జరగడానికి కారణం మీ ఫోటోనే.

"నా ఫోటో ?"

"ఈ ఫోటో చూసే నేను యీ సంబంధానికి ఒప్పుకుంది. అసలు... "

"మిమ్మల్ని లోపలికి రమ్మని పిలుస్తున్నారు" అంటూ పెళ్ళికొడుకుని లోపలికి పిలుచుకు వెళ్ళారు.

ఫోటోల పని పూర్తి అయ్యేసరికి మర్నాడు సాయంకాలం నాలుగు గంటలయింది. తను యింతవరకూ తీసిన పెళ్ళి ఫోటోలకంటె యీ ఫోటోలు చాలా బాగున్నాయి. ఫోటోల వంక చూస్తూంటే ఒక ఆలోచన మసలింది.

"ఇంతకాలం మీరు చూపిన ఆదరణకి ఆపేక్షకి నేను చూపించగల కృతజ్ఞతయిదే"

బజారు వెళ్ళి ఒక చీరె కొనుక్కొని వచ్చాడు. కాగితం కలం తీసుకుని ఉత్తరం రాయటం మొదలు పెట్టాడు. ఉత్తరం పూర్తిచేసి, చాలా సేపటి వరకూ ఆఉత్తరం వంక చూస్తూకూర్చున్నాడు. చివరకు ఉత్తరాన్ని చీరెపెట్టిన సంచిలో వుంచి, ఫోటోలు తీసుకుని పెళ్ళివారి యింటికి వెళ్ళాడు. అక్కడ నిన్నటి సందడి లేదు కాని, హడావిడి మాత్రం యింకా వుంది. తను నిత్యం వెళ్ళే యిల్లే కాని యినాడు ఎందుకనో సంకోచం కలిగింది. పందిట్లోనే నిలబడిపోయాడు. పెళ్ళి కుమార్తె తండ్రి యింట్లోంచి వచ్చాడు.

"ప్రొద్దుటినుంచి కనిపించలేదేం ?"

"ఫోటోల పనిలో వున్నాను."

"అల్లుడు కూడా నిన్ను గురించి చాలా సార్లు అడిగాడు. ఫోటోలు ఎప్పుడు వస్తాయి ?"

"తీసుకు వచ్చాను"

ఫోటోలు చూసి ఆయన చాలా మెచ్చుకున్నాడు. రామం చేతిలో సంచిచూసి.

"ఏమిటది ?" అని అడిగాడు.

'శ్యామలకి ఒక ప్రజెంట్ తీసుకు వచ్చాను.'' ఆయన ఒక్కక్షణం తలపటాయించి. లోపల వుంది యిద్దువుగాని రా అని అంటూ ఆయన కూడా వెంటవచ్చాడు.

అనేకమంది స్నేహితురాళ్ళ మధ్య కూర్చొన్ని శ్యామల కబుర్లు చెబుతోంది.

"అమ్మాయి మన రామం వచ్చాడు" అని వాళ్ళ నాన్న అన్నాడు.

శ్యామల ఏం మాట్లాడలేదు. తన చేతిలో పొట్లం శ్యామలకిస్తూ రామం "కంగ్రాచులేషన్సు" అని అన్నాడు.

"వంటవాళ్ళ కేదో కావాలట" అని ఎవరోవచ్చి శ్యామలా వాళ్ళ నాన్నతో చెబుతున్నారు.

తలవంచుకునే శ్యామల 'థాంక్యూ' అని అంది.

'ఇవ్వాళ మా ఊరికి వెళ్లిపోతున్నాను.'

"మధ్యాహ్నం భోజనానికి రాలేదేం ?"

ఫోటోల హడావిడిలో వున్నాను... మరిచిపోయాను. శ్యామల ఏదో అడుగుదామనుకుంది. అడగబోయింది. తండ్రికోసం చూసింది. ఆయన అక్కడ లేడు. రామం గుమ్మం దగ్గరకు వచ్చాడు. బయటకు వెళ్ళబోతూ ఒక్కసారి వెనక్కి తిరిగి శ్యామల వంక చూశాడు. ఆ పిల్ల అతని దగ్గరకు వచ్చి...

"రామం !" అని పిలిచింది.

"శ్యాం !" అని మెల్లిగా అన్నాడు.

"నువ్వు ఆడేనాటకం నాకు తెలుసు !"

"శ్యాం."

"మంచివాడివని లోకం నిన్ను అనవచ్చు, మా నాన్న అనవచ్చు, అన్నయ్య నమ్మవచ్చు కాని నిజం నీకు తెలుసు."

"శ్యాం"

"మోసగించి ఎవ్వరూ సుఖపడలేదు రాం."

"నిజమే శ్యామలా."

"నువ్వు చేసిన ద్రోహాన్ని యీ కానుక అనుక్షణం గుర్తుకు తెస్తుంది రాం."

"శ్యాం.... అదే నా కోరిక... గుడ్‌బై" అంటూ రామం ఆ గదివంక చూశాడు... ఎవ్వరూ లేరు, తను, శ్యామల మిగిలారు.

'గుడ్‌బైశ్యాం' అంటూ రాం ముందు సావిట్లోకి వచ్చాడు. శ్యామల వాళ్ల నాన్న ఎదురై...

"అన్నం వడ్డిసున్నారు రామం భోజనం చేద్దువుగాని" అని అన్నాడు, రామం వినిపించుకోలేదు. సరాసరి యిల్లు దాటి బయటకు వచ్చేశాడు.

ఆ వూరి నుంచి ఆఖరి రైలు బయలుదేరటానికి యింకా అరగంట వ్యవధి వుంది. రైలు స్టేషను పలచపలచగా వుంది. ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో రామం ఒక్కడూ కూర్చొని, ఒక్కసారి ప్లాటుఫారం మీదకు చూశాడు. బనారసు చీరెకట్టుకున్న పిల్ల ఎవరో వడివడిగా యిటు నడిచి వస్తోంది. రామం ఉలిక్కి పడి అటు చూశాడు. ఆ పిల్ల యితని పెట్టెను దాటి ముందున్న కంపార్టుమెంటు ఎక్కింది. రామం హృదయంలోంచి ఒక నిట్టూర్పు వెలువడింది. సూటుకేసు తెరచి ఫోటో ఆల్బం బయటకు తీసాడు.

ఆకులు కనిపించనంత దట్టంగా కాయలుకాసిన మామిడిచెట్టు దగ్గర, తెల్లచీరె కట్టుకొని జుట్టు విరబోసుకున్న భువనైక సుందరి ఎవరో ఫోటోలో కనిపించింది.

ఆ సుందరిని ఆనాడుతను 'వనసుందరీ' అని పిలిచాడు. ఉలిక్కిపడి తన వంక చూసి "నువ్వా రామం !" అని అన్నది.

"నేనే... ఏమిటి యివాళ చాలా హుషారుగా వున్నావు."

"ఏం లేదు."

"ఏంలేదంటే నమ్ముతాననుకున్నావా. ఎవరైనా పెళ్ళిచూపులకి వస్తున్నారా ?"

"నే నసలు పెళ్ళే చేసుకోను."

అస్తమించే సూర్యుడి వెలుగులో మిలమిల్లాడే చెట్టుకు దగ్గరగా అపురూప సౌందర్యరాసి ! ఎటువంటి సుందరదృశ్యం యిది !!! మరుక్షణం కెమేరా క్లిక్ మన్నది.

"ఎవరేవచ్చింది ?" అంటూ శ్యామలా వాళ్ల నాన్న తోటలోకి వచ్చాడు.

"నేనేనండి"

"నీ కోసమే కబురు పంపిద్దామని అనుకున్నాను. శ్యామలకొక మంచి ఫోటో తియ్యి. పెళ్ళివారికి పంపించాలి. మంచి పట్టుచీర కట్టుకొని రా శ్యామలా."

"నాకు ఫోటోవద్దు" అంటూ శ్యామల అక్కడ నుండి వెళ్లిపోయింది. ఎంత సేపు కనిపెట్టుకుని వున్నా తను రాలేదు. చీకటి పడిపోయింది తను యింటికి

వచ్చేశాడు.

పసిపిల్లవాడ్ని ఎత్తుకున్న యిరవై ఏళ్ళ పిల్ల రామం కంపార్టుమెంటులోకి ఎక్కింది. ఒక్కక్షణం యితని వంక చూసి.....

"ఇది పరుపుల పెట్టె" అంటు దిగిపోయింది.

దృష్టి ఆల్బంలో యింకొక ఫోటో మీద నిలించింది. సముద్రతీరంలో ఒక చిన్నది ఎక్కడో అనంతంలోకి చూస్తూ కూర్చుంది. మదిలో మెసలే మధుర భావమేదో మందహాసంలో కదలిరాగా మై మరచిన యీ కన్నెను చూసి మెచ్చుకోవడం కోసం వచ్చినట్టుగా ఒక పావురాయిల జంట నేలనువాలి ఆ పిల్ల వంక చూస్తున్నాయి.

ఒక్కక్షణం గడిచింది. ఆ పిల్ల నేల మీద ఏవో గీతలు గియ్యటం మొదలు పెట్టింది. ఏమిటా అని రామం పరకాయించి చూశాడు. హృదయం ఆకారం గల బొమ్మలో రెండు అక్షరాలు... రామం !

రామాన్ని చూసి ఉలిక్కిపడి చెరిపివెయ్యబోయింది.

"చెరిపేస్తావా ?" అని రామం అడిగాడు

ఆ పిల్ల మాట్లాడలేదు, ఆ రెండు అక్షరాల క్రింద యింకొక మూడు అక్షరాలు వెలిశాయి.... శ్యామల.....

అక్షరాలు రాసి ఆ పిల్ల ముఖం వంక చూశాడు మాట్లాడకుండా తలవంచుకుంది. రామం అక్షరాలు చెరిపివెయ్యబోతే... ఆపిల్ల అతని చెయ్యి పట్టుకుని "వద్దు" అని అంది.

రామం లేచి రెండుడుగులు వెనక్కి వేశాడు. ఎక్కడివో రెండు పావురాలు శ్యామల దగ్గరగా వాలాయి, వాటివంక చిరునవ్వుతో చూస్తోంది. రామం 'వండర్‌ఫుల్' అని అన్నాడు. మరుక్షణం కెమేరా క్లిక్‌మన్నది.

"ఫోటో తీశావా !"

"ఊ"

"నాతో చెప్పలేదే ?"

చెబుతే బొమ్మయింత బాగారాదు.

"బాగా వస్తుందా"

"నువ్వే చూస్తావుగా ఇది ఎవరైనా పెళ్ళి కొడుక్కి పంపితే కట్నం లేకుండానే పెళ్ళి చేసుకుంటాడు."

శ్యామల ఏం మాట్లాడలేదు. నీటి అంచుకు వెళ్ళి నిలబడ్డది. దగ్గరకు వెళ్ళి

"కోపం వచ్చిందా !" అని రామం అడిగాడు.

"కోపం రాదా !"

పదిమంది పిల్లలు, వాళ్ళ వెంట ఒక ఆయా యిటే వస్తున్నారు. అందులో యిద్దరు మరీ పసిపిల్లలు. కాళ్ళతో యిసుకని చెదరగొడుతూ యిటు వస్తున్నారు. వద్దని శ్యామల వారించే లోపలే అంతా అయిపోయింది. ఇసుకలోని అక్షరాలు నామరూపాలు లేకుండా పోయాయి. కిలకిలమని నవ్వుతూ, పిల్లలు అక్కడే కూర్చొని పిచ్చుక గూళ్ళు కట్టడం మొదలుపెట్టారు. పడమటి దిక్కు నల్లమబ్బు మంచి టప టప మన వాన చినుకులు ఒడ్డునున్న పడవల మీద పడ్డాయి. తల ఎత్తి శ్యామల ఒక్కసారి ఆకాశం వంక చూసింది.

"శ్యాం" అని రామం పిలిచాడు. రామం వంక చూడకుండా తలవంచుకుంది.

"శ్యాం" అని రామం మళ్లీపిలిచాడు. తల ఎత్తి యితనివంక ఒక్క క్షణం చూసి, ముఖం రెండు చేతుల్లో కప్పుకొని వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది. ప్రపంచాన్ని ప్రకృతినే మరిచిపోయి రామం ఆమెకు తీసుకుని కన్నీరు తుడుస్తూ.

"పిచ్చి పిల్లా !" అని అన్నాడు.

"టైమెంతండి ?" అని రామాన్ని ఎవరో అడిగారు.

గడియారం చూసి రామం "ఇంకా యిరవై నిమిషాలుంది" అని అన్నారు.

ఆ రోజు సాయంకాలం నాలుగుగంటలకి ఎవరో గది తలుపు తడుతున్నారు. తలుపు తీస్తే శ్యామలా వాళ్ళ నాన్నగారు నిలబడి వున్నారు. లోపలికి వచ్చి కుర్చీలో కూర్చుని

"ఏం రామం యీ మధ్య ఎక్కడా కనిపించటం లేదే ?"

"పరీక్షలు వస్తున్నాయి. చదువుకుంటున్నాను."

"మంచిది ! బాగా చదువు నీకు యూనివర్శిటీ ఫస్టు వస్తుందని అబ్బాయి కూడా అన్నాడు.... చూసి చాలా రోజులైంది... ఒక్కసారి పలుకరించి పోదామని వచ్చాను."

"థాంక్యూ సర్."

ఏమిటోగాని రామం నువ్వు యీ ఊరు వచ్చినప్పటి నుంచి మా పిల్లలతో కలిసిపోయావు. నాకూ మీ పిన్నికి నువ్వు కూడా మా అబ్బాయితో పాటే అనిపించింది. మాకు మాత్రం ఏ పదిమంది వున్నారు.... ! ఒక్కగానొక్క ఆడపిల్ల, ఒక మగపిల్లవాడు, మేము ఏంచేసినా వాళ్ళ మంచి కోసమేగదా !

"కృష్ణ చెప్పిన మాట వినటం లేదా ?"

"కృష్ణ మాటకాదు పైకి అల్లరి వాడుగా కనిపించినా వాడి మనస్సుచాలా మంచిది. తల్లిదండ్రులంటే వాడికి ఎంతో గౌరవం, వాడి వల్ల మాకే యిబ్బంది."

"ఇంతకూ ఏం జరిగింది ?"

"అమ్మాయికి ఒక మంచి సంబంధం చూసాం. అన్ని విధాలా మనకు తగిన సంబంధం" కుర్రవాడు బుద్ధిమంతుడు. ఐ.ఎ.యస్.లో సెలక్టు అయ్యాడు.

"అంతా సరేనన్నారు. అబ్బాయికి కూడా నచ్చింది."

'మరి'

"శ్యామల మాత్రం ససేమిరా ఒప్పుకోనంటోంది."

'ఎందుకని'

"తనకు పెళ్ళే అక్కర్లేదట... చూడు రామం నువ్వంటే దానికి ఎంతో అభిమానం... నువ్వు చెబితే కాదనదు."

"ఏమని చెప్పమంటారు ?"

" ఈసంబంధం ఒప్పుకోమని"

"నేను చెప్పలేను"

ఎందుకని

రామంలేచి కిటికి దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. కిటికిలోంచి బయటకు చూస్తే బయట రోడ్డుమీద యిద్దరు బిచ్చగాళ్ళు వచ్చి, ఎదురింటి అరుగుమీద కూర్చున్నారు. ఒకడు కుంటివాడు రెండవవాడు గుడ్డివాడు, మూకుడులో అన్నంపెట్టి, గుడ్డివాడి ముందర వుంచి, కుంటివాడు మంచినీళ్ళు తీసుకురావటానికి కొళాయి దగ్గరకు వెడుతున్నాడు.

గాజు గ్లాసులో కూజాలో నీళ్ళుపోస్తూ రామం "శ్యామల ఎవరినన్నా ప్రేమిస్తోందేమో" అని అన్నాడు.

"ఆ విషయం కూడా అడిగాం"

"ఏమన్నది ?"

"మొదట్లో ఏం చెప్పలేదు. తల్లి మెల్లిగా బుజ్జగించి అడిగితే అసలు విషయం చెప్పింది."

ఏమని ?

"నిన్ను తప్ప ఎవరిని చేసుకోనని"

"దానికి మీరే మన్నారు."

"ఏమనమన్నావో నువ్వే చెప్పు రామం ! ఇంతకాలం నలుగురిలో ఔననిపించుకుంటూ బ్రతికాము. ఈ నాడు చులకనకాలేము."

రామం చేతిలో గాజు గ్లాసు క్రిందపడి ముక్కలైంది. వాటి వంకన్నా చూడకుండా రామం కిటికిలోంచి బయటకు చూశాడు. గుడ్డివాడి అన్నం మూకుడు కుక్కలాక్కుని పోయింది. పెద్ద పెద్ద కేకలు పెడుతూ గుడ్డివాడు రోడ్డుకు అడ్డంగా నడవటం మొదలు పెట్టాడు. పెద్ద పెట్టున హారన్ కొట్టి సడన్ బ్రేకులు వేసుకుని లారీ ఆగింది. మంచినీళ్ళు తీసుకువస్తున్న కుంటివాడు మంచినీళ్ళ డబ్బాక్రింద పారేసి, అన్నా ! అన్నా! అంటూ గుడ్డివాడి దగ్గరకు రావడం మొదలు పెట్టాడు.

"కళ్ళు కనిపించడం లేదా" లారీ డ్రైవర్ అరిచాడు.

"కళ్ళులేని కబోదిని బాబయ్యా.... అంటూ గుడ్డివాడు అన్నాడు. కాలుస్తున్న బీడి క్రింద పారేసి, లారీ డ్రైవరు క్రిందకు వచ్చి, చెయ్యి పుచ్చుకుని, గుడ్డి వాడిని కుంటివాడి దగ్గర చేర్చాడు. చేతిలో ఒక పది నయాపైసల బిళ్ళ పెట్టాడు. గుడ్డివాడు డబ్బు తడిమి చూసుకుని జాలిగల మహారాజువి పిల్లాజెల్లాతో పది కాలాలపాటు సుఖంగా వుండుదొరా" అని దీవించాడు. లారీడ్రైవరు ఏం మాట్లాడలేదు, లారీ దగ్గరకు వచ్చి యింకొక బీడి ముట్టించాడు. కాని కళ్ళ వెంబడి ఆగకుండా కన్నీరు.

"ఎందుకు ఏడుస్తున్నాడు" అని రోడ్డునపోయే వాళ్లెవరో అడిగారు.

"ఇల్లు కూలి మొన్న అతని భార్య యిద్దరు పిల్లలు పోయారు" అని క్లీనరు సమాధానం చెప్పాడు.

"పాపం !" అని నలుగురు అన్నారు.

నిట్టూర్పు విడిచి రామం కిటికీ దగ్గర నుంచి వెనక్కి తిరిగాడు.

"కోపం వద్దు రామం" అంటూ శ్యామలా వాళ్ళ నాన్న గారేదో చెబుతున్నారు.

రామం గదిలోంచి బయటకు వచ్చేశాడు. పరుగెత్తుతున్నంత వేగంగా నడవటం మొదలు పెట్టాడు. ఎంత దూరం నడిచాడో తెలియదు. ఎటు చూసినా నిశ్శబ్దం, నిశ్శబ్దం వెంట చీకటి, చుట్టూతా కలయజూస్తే స్మశానం. అక్కడక్కడ సమాధులు తులసి కోటలు, ఒక సమాధి దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు.

చీకటిలోంచి పదిమంది జనం వచ్చారు. ఎవరినో దహనం చేసి యింటికి వెడుతున్నారు. ఒక పండు ముదుసలి. ఒక పడుచువాడి చెయ్యి ఆసరా తీసుకుని మెల్లిగా నడుస్తున్నాడు. ఆ జనంలోంచి ఒక వ్యక్తి రామం దగ్గరకు వచ్చి,

"ఎవరివి ?" అని అడిగాడు

"మనిషిని" అని సమాధానం వచ్చింది.

"చీకట్లో ఒంటరిగా కూర్చున్నావేం నాయనా యింటికి పద."

"ప్చ్ ! ఇంకా యిల్లు...."

"ఇప్పుడు అల్లాగే అనిపిస్తుంది. నాయనా ! మొగజన్మ ఎత్తింది బ్రతుకుని చూసి భయపడటానికి కాదు. బాధలు ఓర్చుకోవడానికి"

"నాకేం బాధలు లేవు"

'సంతోషంగా వుండే వాళ్లెవరూ స్మశానంలోకి వచ్చికూచోరు. బాధలని జయించడానికి పద్ధతి యిది కాదు. ఆ ముసలాయన్ని చూడు. ఒక్కగానొక్క కొడుకు మొన్ననే మంచి ఉద్యోగం కూడా వచ్చింది. కాని దైవం చిన్న చూపుచూశాడు. మొక్క మొలిచింది. పెరిగి పెద్దదైంది. పువ్వులు పూసింది, కాయలు కాసింది, ఫలం అనుభవించే వేళకు పిడుగుపడ్డది. సర్వనాశనమైంది. ఈ ముసలి వయస్సులో నా అనే వాళ్ళు లేక ఒంటరివాడయ్యాడు. ఆయనకు వచ్చిన కష్టం కంటె నీకు పెద్ద కష్టం వచ్చిందా...."

ఇహ వినిపించుకోకుండా రాము అక్కడి నుంచి బయలుదేరాడు. పలుకరించిన మనిషి "నాయనా !" అని పిలిచాడు. రామం ఆగలేదు, పిలుపు దూరమైంది.

ఎటు నడుస్తున్నాడో ఎటు వెడుతున్నాడో తెలియటం లేదు.

ఎటు చూసినా చీకటి

ఎటు చూసినా నిరాశ

మనస్సులో ఏదో అర్థంకాని బాధ

ఈ ఊరు వదిలి దూరంగా వెళ్ళిపోతే ?

ఇంతకాలం చదివిన చదువు ?

పెద్ద పెద్ద చదువులు చదివి తను ఏం సాధించాలి ?

ఆయువుంటేనే ఆశలు, నిరాశలు అదే లేకపోతే ?

ఈ జీవితానికి అర్థమేమిటి ?

ఎవ్వరికీ అక్కర్లేదు యీ బ్రతుకుదేనికి ?

తనకు ఎవ్వరూ లేరు

తను ఎవ్వరికి ఏమీ కాడు.

ఈ శిధిల శకలానికి,

ఈ మందులేని వ్యాధికి

మరణమే శరణం

"మరణించాలి ! మరణించాలి"

తప్పదు, తప్పదు, తప్పదు.

ఇంటికి ఎప్పుడు చేరాడో ఎల్లాచేరాడో తెలియదు. దీపమన్నా వెలిగించకుండా కటిక చీకటుల మధ్య నిరాశతో నిస్పృహతో ఒంటరిగా కూర్చున్నాడు.

మెయిన్ రోడ్డుమీద హోటలులోంచి బినాకా గీత్‌మాలా "పాటలు వినిపిస్తున్నాయి. లతామంగేష్కరు

"కహి దీప్ జలే ఔర్ దిల్‌కి" అని పాడుతోంది. రామం గదిలో దీపం వెలిగింది.

"నాయనా రాంబాబు" అని ఎవరిదో కంఠం వినిపించింది. కలలోంచి తెప్పరిల్లిన్న వాడిలాగా రామం ఉలిక్కిపడి అటు చూశాడు. ఆ కంఠం తనకి తెలిసిందే. క్రింద భాగంలో అద్దెకున్న సుభద్రమ్మగారిది.

"చీకట్లో కూర్చున్నావేం బాబు !"

" ఏం లేదండి. ఎందుకనో కళ్ళు మంటలుగా వున్నాయి. అందుకని లైటు వెలిగించలేదు."

"చదివి చదివి ఒళ్ళు వేడిచేసి వుంటుంది. రేపు తలంటి పోసుకో అదే తగ్గిపోతుంది. సాయంకాం నుంచి నీ కోసం ఎదురుచూస్తున్నాం "

"నాకోసమా ? దేనికండి ?"

"ఇవ్వాళ మా పద్మ పుట్టిన రోజు, మా యింటికి భోజనానికి రావాలి "

"పద్మ పుట్టిన రోజా ! ఆహ ! హ !" అంటూ రామం పెద్ద పెట్టున నవ్వాడు ఆవిడ తెల్లబోయి ఇతని వంక చూసింది.

"ఏం లేదండి పత్రికలో చదివిన బుడుగు కథ గుర్తుకు వచ్చింది. నవ్వు వచ్చింది. ఏమనుకోకండి"

"దానికేంలే నాయనా ! నిన్ను భోజనానికి పిలవమని పద్మ పదిరోజులుగా చెబుతోంది."

'నన్నా'

"నువ్వంటే దానికి చాలా ఆపేక్ష. వచ్చిన రోజునే నిన్ను చూడగానే అచ్చంగా అన్నయ్యలాగా వున్నాడు కదమ్మా అని అంది"

"అల్లాగా... మీ అబ్బాయి ఎక్కడ వున్నాడు."

"మా రామం ప్రస్తుతం జర్మనీలో వున్నాడు. వచ్చే ఏడాది తిరిగి వస్తాడు."
'బాగుంది చాలా సంతోషమండి.'

భోజనం దగ్గర పద్మ, వాళ్ళమ్మ చూపించిన ఆత్మీయత ఆదరణ స్నేహాలతో

అర్ధంకాని బాధ ఒక్కక్షణం ఆవరించింది మనస్సు లిప్తకాలం మూగపోయింది. అంతలోనే అంతులేని ఆనందం కలిగింది.

"అమ్మ వుంటె యిల్లు యిలా వుంటుంది కాబోలు" అని అనుకున్నాడు.

భోజనం చేసి తన గదిలోకి వస్తూంటె సుభద్రమ్మగారు

"ఎప్పుడన్నా వస్తూండు నాయనా, మేమేం పరాయి వాళ్ళంకాదు" అని అన్నది. పద్మసంగతి చెప్పనే అక్కర్లేదు. ఎన్నో సంవత్సరాలుగా తెలిసినంత చనువుగా స్వంత చెల్లెలి కంటె ఆపేక్షగా తన దగ్గర అరమరికలు లేకుండా మసలింది. మాటల మధ్య...

"మా వదిన పేరేమిటి ?" అని అడిగింది పరధ్యానంగా వున్న రామం.

"శ్యాం..." అంటూ మొదట, రామం గతుక్కుమని మానేశాడు.

"శ్యాం ఏమిటి మొగవాడి పేరు ?" అని పద్మ అడిగింది.

"నీకు తెలియదులే" అని రామం అన్నాడు.

"నాకు తెలుసులే" అంటూ పదేళ్ళ పద్మ పాతికేళ్ళ దానంత చిలిపిగా నవ్వింది

తన గదికి తిరిగి వచ్చేసరికి మనస్సు ఎంతో తేలికపడ్డది ఎవరో అత్యంత ఆత్మీయులని కలుసుకున్నట్లు అనిపించింది. బాధ తగ్గింది. బ్రతుకంటె మళ్ళీ అర్థం కనిపించింది. రోజులు గడిచిపోతున్నాయి. పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి. ఆంజేయ స్వామి గుడికి వెళ్ళి వస్తూంటే మండపం దగ్గర శ్యామల కనిపించింది. ఇతన్ని చూడగానే దగ్గరకు వచ్చి.

"రామం... కనిపించకూడదనుకున్నావా ?"

"పరీక్షలు వస్తున్నాయి"

"నువ్వు వస్తావని ప్రతిరోజూ ఎదురు చూస్తున్నాను."

"తీరికలేదా ?"

"మా యింటికి రావడానికి నీకు తీరిక లేదా ? నువ్వు కూడా అందరిలాగా మరిపోయావా ?"

"మార్పు సహజం"

"సహజమా ? నువ్వు మారటం సహజం కాదు రామం ! నేను ఎటువంటి కష్టాలలో వున్నానో తెలుసా రామం !"

"నీకు కష్టమా ?"

"నాన్న నాకో పెళ్లి సంబంధం తీసుకువచ్చాడు. ఎల్లాగైనా చేసుకోమని బలవంతం పెడుతున్నాడు."

"పరాయివాడిని నేను చెబితే వింటారా ?"

"నువ్వు నాకు పరాయి వాడివి కాదు రామం !"

"చూడు శ్యాం ! వాళ్ళు ఏం చేసినా నీ మంచి కోసమే చేస్తారు."

"నా గొంతుక కోస్తున్నారు."

"వాళ్ళు నీ తల్లితండ్రులు"

"రామం, యిల్లాగేనా మాట్లాడేది ?"

"ఇంతకంటె ఎల్లా మాట్లాడను ?"

"ఇప్పటికీ నీకు అర్థంకావటం లేదా రామం. నా వివాహం ఒక్క వ్యక్తితోనే జరుగుతుంది."

"ఆ వ్యక్తి నిన్ను చేసుకోలేడు."

"ఎందుకని"

"అర్హత లేక"

"నీకు లేని అర్హత ఎవరికీ లేదు రామం."

"కాదు శ్యామలా, కొందరి జీవితాలు మామూలుగా నడవ్వు. ఆనందానికి సంతోషానికి వాళ్ళు నోచుకోరు... ఏదో ఒక ప్రత్యేకమైన పనికోసం భగవంతుడు వాళ్ళని సృష్టిస్తాడు మామూలు మనుష్యుల్లాగా వుండటానికి వాళ్ళకి అవకాశం లేదు.

'నువ్వూ అటువంటి వాడివేనంటావా ?'

అని నా నమ్మకం, పుట్టినప్పటి నుంచి యీ నాటి వరకు దుఃఖమే చూశాను. మీ సాంగత్యంలో వున్న యీ కొద్ది రోజులు సుఖం అనుభవించాను."

"నువ్వు కావాలంనుకుంటే యీ సుఖం ఎప్పుడూ వుంటుంది రాం."

"లాభం లేదు శ్యాం, నా జీవిత పంథా వేరు. నేను సాధించవలసిన లక్ష్యాలు వేరు.

"ఎవరు చూసి మెచ్చడానికి"

"లోకమంతా"

"మనసిచ్చిన వారిని మోసం చేసిన వాళ్ళని లోకం మెచ్చుతుందా ?"

"నేను ఎవ్వరినీ మోసం చెయ్యలేదు"

"ఒక్కమాట అడగనా రాం"

"అడుగు"

"నన్ను ఎప్పుడూ ప్రేమించలేదా"

.....................

'మాట్లాడవేం రాం ? మాట్లాడవేం ?'

'ప్రేమించలేదు'

"నాముఖం చూసి ఆ మాట చెప్పు రాం"

ఆకాశం మీద దట్టంగా కమ్మిన నల్లటి మబ్బుల వంక రామం చూస్తున్నాడు. మబ్బులని చీల్చుకుంటూ, కళ్ళు మిరుమిట్లు కొలిపే మెరుపు వచ్చింది. ఆలయం గాలి గోపురం కంటికి కనిపించింది. మెరుపు వెనువెంటనే బ్రహ్మాండం దద్దరిల్లే ఉరుము వినిపించింది. దగ్గరలోనే ఎక్కడో పిడుగు పడ్డది. ధ్వజ స్థంభం గంటలు పెనుగాలికి ఆక్రోశించాయి. గుడిలో గంటలు ఆగకుండా మ్రోగుతున్నాయి. చీకటిలో వెడుతూ తీతువు పిట్ట కూసింది తల్లి యింకా గూటికి చేరలేదని, చెట్టు మీద పక్షి పిల్లలు భయంతో అరిచాయి. భయపడిన గ్రామసింహ మేదో ఎలుగెత్తి విలపిస్తోంది. మాలపల్లిలో పాకలు అంటుకున్నాయి. గగ్గోలుగా పరిగెత్తి జనం జనంకంటె ముందర ఆపకుండా గంటలు కొడుతూ వెడుతన్న ఫైర్ యింజను.

మనస్సంతా అంతులేని ఆవేదనతో నిండిపోయింది. కన్నీరు కనుకొలుకులు దాకా వచ్చి ఆగింది. అనంతంలోకి చూస్తూ రామం.

"ఎప్పుడూ ప్రేమించలేదా రామం... సరే ! అర్ధంమైంది రామం. ఇంతకాలం నా మీద చూపిన ప్రేమ అంతా ఒక నటన, నయవంచన నా జీవితంతో చెలగాటమాడావు. ఈ నాడు ఎవరిమీదకో మనస్సు మళ్ళింది. ముఖం తప్పించావు"

"కాదు శ్యామలా"

"ఇంకా అబద్దాలు ఆడద్దు రామం... నా సర్వస్వం నువ్వేనని నమ్మాను. నీ అండ వుంటే, నాకేం అక్కర్లేదని అనుకున్నాను... నా సరస్వం నాశనం చేశావు."

"నన్ను అర్థం చేసుకో శ్యాం"

"ఇంతవరకూ మోసపోయాను... ఇప్పుడు బాగా అర్దం చేసుకున్నాను. వెళ్లు రాం ! వెళ్లిపో వెళ్ళి నీ లక్ష్యాలేవో సాధించు సాధించు రాం. లోకమంతా మెచ్చుతుంది."

అంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ అక్కడే కూలబడ్డది. దైవప్రసాదం నేలపాలైంది. భగవంతుని పాదాల్ని తాకిన కలువ పువ్వు మట్టిలో కలిసింది.

గుడికి వచ్చిన చిన్న పిల్ల ఎవరో శ్యామలని చూసి..

"పడిపోయావా అక్కా" అని అడిగింది. రామం ఏం మాట్లాడలేదు. పడిపోయిన ప్రసాదాన్ని పువ్వులని పళ్ళెంలోకి సర్దాడు. ఆ పళ్ళేన్ని శ్యామల దగ్గర పెడుతూ

మెల్లిగా

"ఇంటికి వెళ్ళు శ్యాం" అని అన్నాడు.

శ్యామల ఏం మాట్లాడలేదు. అతని వంక చూడకుండా అక్కడ నుంచి బయలుదేరింది. వడివడిగా అంగలు వేసుకుంటూ యింటికి చేరింది. రవ్వంత దూరంగా వెనుక తను సందు చివర ఆగి వాళ్ళ యింటి వంక ఒక్కక్షణం చూస్తూ నిలబడ్డాడు. వర్షం ప్రారంభమైంది. చినుకులు పెద్దవైయ్యాయి. శ్యామలా వాళ్ళ యింట్లో లైట్లు ఆరిపోయాయి.

ఆకాశాన్ని చీల్చుకొని మెరుపు వచ్చింది హృదయాన్ని చీల్చుకుని నిట్టూర్పు వచ్చింది. ఆవేదన వరదలైంది.

"నన్ను క్షమించు శ్యాం. నన్ను క్షమించు" అని అనుకుంటూ రామం అక్కడ నుంచి బయలుదేరాడు.

వారం రోజుల తరువాత క్లాసు నుంచి వస్తూంటే ప్రొఫెసరు పిలిచాడు.

"ఈ మధ్య చాలా పరధ్యానంగా వుంటున్నావు, ఒంట్లో బాగుండలేదా ?"

"బాగానే వుంది సార్"

"నీకు బాధ కలిగించే సంఘటన ఏదైనా జరిగిందా ?"

"లేదు సార్"

"చూడు రామం ! నీలాంటి విద్యార్థి పదేళ్ళకో పాతికేళ్ళకో ఒకడు వస్తూ వుంటాడు. వాళ్ళని చూసినప్పుడు మేము యింతకాలం పడ్డశ్రమకు తగిన ఫలితం లభించిందని, మా పేరు నిలబెట్టే శిష్యుడు దొరికాడని సంతోషిస్తాం, నీకు యూనివర్సిటీ ఫస్టు వచ్చి గోల్డు మెడలు పుచ్చుకుంటున్నప్పుడు చూడాలని మా అందరికి ఆశ. ఆ దృశ్యం చూసి గర్వపడాలని మా అందరి అభిలాష"

"ప్రయత్నం చేస్తున్నానండి, కాని చదవలేకపోతున్నాను."

"క్లాసులో పాఠం చెప్పడంతోనే కాదు నీ బాధ్యత నాకు ఎప్పుడూ వుంటుంది."

..............................

"మన మనస్సులోని బాధ యితరులతో చెబితే ఉపశమనం కలుగుతుంది. దుఃఖం పోగొట్టడానికి ఏదైనా ఉపాయం లభించవచ్చు."

"నన్నేం అడగద్దు సార్"

"అడగనులే... నీకు ఏ సహాయం కావలసినా నా దగ్గరకు రా"

'నాకు ఎవ్వరూ సహాయం చెయ్యలేరు'

'చూడు రామం ! కోరందే ఎవ్వరూ సహాయం చెయ్యరు. ఏదో ఒక్క చిన్న విషయం వల్ల నీ భవిష్యత్తు పాడు అవటం నాకు యిష్టం లేదు.'

..................................

"ఆ పిల్ల తల్లిదండ్రులెవరో నాతో చెప్పు ! నేను వాళ్ళతో మాట్లాడతాను."

..................................

"ఆలోచించి నాతో చెప్పు. నేను నీకు గురువునే కాదు. స్నేహితుడిని కూడా"

రోజులు గడిచిపోయాయి. రేపు పరీక్షలనగా, కృష్ణా శ్యామలా వాళ్ళ నాన్న బజారులో కనిపించారు. రామాన్ని చూడగానే కృష్ణ.

"ఒరేయి నల్లపూస" అంటూ కేక బెట్టాడు దగ్గరకు రాగానే.

"రేపటి నుంచి పరీక్షలు"

"బాగా రాయి, గుడ్‌లక్.. పరీక్షలు రాయగానే వూళ్ళోంచి పారిపోకు. మన శ్యామల పెళ్ళి"

"ఎప్పుడు ?"

"నీ పరీక్షలైన మర్నాడు"

"ఏదో తారీఖునా ? పెళ్ళి కొడుకు ఎవరు ?"

"ఒక వండర్ ఫుల్ మాన్ ఐ.ఎ.ఎస్. ప్రస్తుతం అస్సాంలో వుంటున్నాడు. "

"బాగుంది"

"బాగుంది అంటె సరిపోదు. పరీక్షలు కదా అని నీకు పెళ్ళి పనులు పురమాయించ లేదు. ఫోటోలు పని మాత్రం నీదేనయ్యా"

'నేనా ? స్టూడియోల వాళ్ళు బాగా తీస్తారు'

"నాకు కుడి భుజంగా, యీ కృష్ణుడికి అర్జునుడిగా, ఒక లోకవిఖ్యాత ఫోటో గ్రాఫరు దగ్గర వుండగా నేను స్టూడియోల వాళ్ళని పిలుస్తానా ? అది నీకు యిన్సల్టు, నాకు నామర్దా"

"నేను....."

"నేను లేదు నువ్వు లేదు ఫొటోలు బాగా తియ్యి, మా బావగారితో చెప్పి పంచెల చాపు పెట్టిస్తాను."

"థాంక్సు"

"ఇది అఫీషియలు పిలుపు కాదు. శుభలేఖలు అచ్చు అవుతున్నాయి. అవి రాగానే బొట్టు కాటుకా పెట్టి నేను పిలుస్తాను సిద్ధంగా వుండు"

"అల్లాగే"

స్టేషనులో గంట కొట్టారు ఈలవేసి గార్డు పచ్చదీపం చూపాడు రైలు బిగ్గరగా కూసింది. స్టేషను మాష్టరు గదిలో గడియారం ఎనిమిది కొట్టింది ట్రావెలర్సు బంగళా దగ్గర ఫిరంగి మోగింది.

మనస్సుల్లోంచి ఒక నిట్టూర్పు వచ్చింది రైలు కదలింది.

ఫిరంగీ మోగింది. పాటకచ్చేరి పూర్తి అయింది. పందిట్లో భోజనాలు ఏర్పాట్లు జరుగుతున్నాయి బట్టలు మార్చుకోవడానికి శ్యామల తన గదిలోకి వెళ్ళింది. రామం యిచ్చిన బహుమతి విప్పకుండా అల్లాగే వుంది. పొట్లం విప్పింది మస్టర్డ్ కలర్ ధర్మవరం చీరెమీద ఆకుపచ్చ రంగు నెమిళ్ళు. తనకు ఎంతో నచ్చిన రంగు. ఎంతో కాలంగా కావాలని మోజుపడిన చీరె. ఆ చీరెని చూస్తూంటే మనస్సు గద్గదమైంది. కన్నీరు కతాన్ని అడ్డింది. మనస్సు ఒకటే ప్రశ్న అడిగింది.

"ఎందుకిల్లా మారిపోయావు రామం ?"

చీర మడతల్లోంచి ఒక ఉత్తరం క్రింద పడ్డది వణుకుతున్న చేతులతోఆ ఉత్తరాన్ని విప్పి చదవటం మొదలు పెట్టింది.

ప్రియబాంధవీ,

బహుశః నువ్వు యీ ఉత్తరం చదివే సమయానికి నేను చాలా దూరంలో వుంటాను. ఐదు సంవత్సరాలు మీ అందరికీ ఆత్మీయుడుగా మసలి యీనాడు అందరికన్నా ఆత్మీయురాలైన నీ దృష్టిలో వంచకుడుగా, మోసగాడుగా మారడమనేది నాకు ఎంతో బాధ కలిగించింది. నీ స్నేహాన్ని చెలిమిని నేను మోసంతో పొందాననే భావన నీకు కలగకూడదనే యీ ఉత్తరం వ్రాస్తున్నాను. నీ అంతట నీవు ప్రాధేయపడినా, నేను కసాయి వాడిలాగా ప్రవర్తించానని నీకు ఎంతో కోపం వచ్చింది. నిన్ను యీనాడు చేపట్టినవారు ఎంతో మంచివారు. వారి నీడలో నీ జీవితం తప్పక సుఖమయం అవుతుంది. నీకు యీనాడు సర్వస్వం వుంది. నేను ఏమీలేని బికారిని శ్యాం... నా వల్ల నీకు నీవారికి జరిగేదేల్లా అపకారం, అవమానమే.

ఎంతోకాలంగా నీతో ఒక విషయం చెబుదామని ఎన్నోసార్లు అనుకున్నాను. కాని మీ ఆత్మీయత ఆదరణలో క్రొత్త వెలుగును చూసిన నేను జీవితంలో ఏర్పడిన యీ మహదానందం యీ చల్లని వెన్నెల నిజం చెబితే దూరమవుతామేమో నన్న భయంతో స్వార్థంతో యింతకాలం దాచాను. ఈ అంతులేని ఆనందంలో మరచిపోయాను. నేను మరచినా లోకం మరువలేదు. తియ్యటికలలు కరిగి, మళ్ళీ యీ కరుణలేని కరుకు కసాయి ప్రపంచములోకి వచ్చిపడ్డాను. నేను చేస్తున్న పొరబాటు అర్థం చేసుకున్నాను.

ఇరవై రెండు సంవత్సరాల క్రితం ఒక వూళ్ళో ఒక సజ్జన సంపన్న కుటుంబం ఒక యింటికి అద్దెకు వచ్చారు. వాళ్ళకు మహలక్ష్మిలాంటి ఒక్కగానొక్క ఆడపిల్ల ఐనవాళ్ళయింటి కోడలే. రేపోమాపో కాపురానికి పంపిద్దామని తల్లిదండ్రులు అనుకుంటున్నారు. ఆ యింటివారి అబ్బాయి సెలవులకు యింటికి వచ్చాడు. వచ్చిన రోజునే యీ మహాలక్ష్మికి మంచి రోజులు దూరమయ్యాయి. చూపులు కలిసాయి. మనసులలో ఏవో తెలియని భావనలు రేకెత్తాయి. ఇది తప్పని తెలుసుకునే లోపలే యిద్దరి మమతలు గాఢమయ్యాయి. ఎదుటపడ్డ క్షణంలోనే కన్నులు కావ్యాలు పలికేవి, చివరకు సెలవలు వచ్చాయి. మమతలు చేరువకు వచ్చాయి. మోహం గాఢమైంది. మంచి దూరమైంది. పెద్దల వెంట తిరణాలకు వచ్చిన జంట మాయమైంది. మమతలు, మోజులు, మకరందం అన్నీ తుమ్మెద మనసార పొందింది. మనసుతిరగ్గానే భ్రమరం మనస్సు మారింది. ఈ మధురం అతి మధురమైంది. ఈ పుష్పాన్ని వదిలి వేరువేరు పుష్పాల మీద వాలుతూ తుమ్మెద అజ్ఞాతంలోకి మాయమైంది. వికసించిన పుష్పం ఫలించింది.

సన్నజాజి మల్లెమొగ్గగా మారింది. వడినిండింది. కాని మనస్సు చిన్నబోయింది. ఎటు చూసినా నిరాశ. నిస్పృహ కరుణజూపమని కాళ్ళ మ్రొక్కితే కామించేవారేగాని, కనికరించేవారు కానరాక, ఈ సుడిగుండంలో నిలువలేక ఈ నమ్మకద్రోహాన్ని తట్టుకోలేక తల్లడిల్లి పుట్టినింటికి దూరమై బ్రతుకు భారమై తన నీడని నిలిచితే తన కన్న బిడ్డ కూడా తనలాగానే అవుతుందని భయపడి గడిచినదంతా కన్నీటితో కథగా రాసి పసికందు మెడలో కట్టింది. ఒడ్డున ఒదిలి తను జలదేవత పరమైంది. చూసినవారు చేరదీశారు, కన్నతల్లి కోసం ఆమె కన్నవారికోసం గాలించి యీ విషాదవార్త తెలియపర్చారు. తను వంశగౌరవాన్ని మంట గలిపిన నిర్భాగ్యురాలి పాప ఫలితాన్ని చేరదియ్యడానికి కన్నవారు ఒప్పుకోలేదు. ఆనాటి నుంచి పరుల పంచనే పెరిగాను. కన్న తల్లింద్రుల కంటె వాళ్ళు ఎక్కువ ఆదరణచూపినా నేను వారి కన్నబిడ్డను కాను అనే విషయం నా పెంపుడు తల్లి ఏనాడో నన్ను మరువ నీయలేదు. కాని నా పెంపుడు తండ్రి ఏనాడో మరచిపోయాడు. ఈ విద్య యీ విత్తం వారి చలవే.

ఈ నిజం మీ నాన్నగారికి తెలుసు. అందుకనే వారు కాదన్నారు. మన ఇద్దరి ప్రేమకు అడ్డుగా నిలచి ఒక మహాప్రమాదాన్ని తప్పించారు.

నన్ను ద్వేషిస్తూ నీ మనస్సు పాడు చేసుకోవద్దు. నాకోసం నీ కన్నీటిని వెచ్చబెట్టవ వద్దు. నేను ఎక్కడ వున్నా ఎల్లావున్నా నీవు నీ వారు ఆనందంగా వున్నారనే తలంపే నాకు దివ్య రక్ష.....

ఈ రామాన్ని మరిచిపో శ్యాం....... మరిచిపో..........